క్లుప్తంగా

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

కొవ్వూరు: వచ్చే నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ నది పుష్కరాల నేపథ్యంలో కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. దక్షిణ త్రివేణి సంగమం (గోదావరి, ప్రాణహిత, సరస్వతీ)లో పుణ్య స్నానాలు ఆచరించేందుకు కొవ్వూరు నుంచి మే 14న సరస్వతీ ధామమ్-పుష్కర యాత్ర పేరుతో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు బాసర జ్ఞాన సరస్వతీదేవి, ధర్మపురిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి, కాళేశ్వరంలో మహా కాళేశ్వ రుడు -సరస్వతీ పుష్కర స్నానం, కొండగట్టు ఆంజనేయస్వామి, వేములవాడ రాజరాజేశ్వరస్వామి, వరంగల్ భద్రకాళీమాత, రామప్పలో రామప్ప దేవాలయం దర్శనం ఉంటాయని వివరించారు. ఒక్కొక్కరికీ రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు యాత్ర సాగుతుందన్నారు. వివరాలకు 73829 07952 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపు కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: పురపాలక సంఘ సాధారణ సమావేశం ఈ నెల 26న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ బావన రత్న కుమారి తెలిపారు. పట్టణంలో ప్రజా సమస్యలు, వివిధ అభివృద్ధి పనులపై చర్చిస్తారని చెప్పారు.

సర్పంచ్‌కు తలారి పరామర్శ



సర్పంచ్ శ్రీరామమూర్తిని పరామర్శిస్తున్న వెంకట్రావు, నాయకులు

చాగల్లు: చంద్రవరం సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి శ్రీరామమూర్తిని మాజీ ఎమ్మెల్యే, పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు గురువారం పరామర్శించారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యారు. చంద్రవరంలోని శ్రీరామమూర్తి నివాసంలో ఆయన్ను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని వెంకట్రావు ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు కంఠమని రమేష్, గంధ్రోతు సురేంద్రకుమార్, తోట రామకృష్ణ, జుట్టా కొండలరావు, చిట్టూరి అన్నవరం, సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగదు, ఆభరణాల చోరీ

కొవ్వూరు: పట్టణంలో ప్రభుత్వాస్పత్రి వెనుక వీధిలో నివసిస్తున్న కంకటాల సిద్ధిగణపతి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం ఇంటికి తాళాలు వేసి కుటుంబమంతా గొల్లగూడెంలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు.. రూ.లక్ష నగదు, మూడు కాసుల బంగారు ఆభరణాలు తస్కరించారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగొచ్చిన సిద్ధిగణపతి చోరీ జరిగినట్లు గుర్తించారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ పి.విశ్వం తెలిపారు.

బాలిక అదృశ్యం

కొవ్వూరు: పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఈ నెల 21 నుంచి కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ ఆర్.సాంబమూర్తి తెలిపారు. ఆమె జాడ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించారు.

కవలలకు సత్కారం



తనుశ్రీ, తన్వికను సత్కరిస్తున్న పెద్దలు

ఉండ్రాజవరం: ఇంటర్ సెకండియర్‌లో వెలగదుర్రు గ్రామానికి చెందిన కవల విద్యార్థులు గున్నేపల్లి తనుశ్రీ, గున్నేపల్లి తన్విక ఉత్తమ ఫలితాలు సాధించారు. స్థానిక పంచాయతీ వద్ద గురువారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదివిన వీరు సీఈసీలో తన్విక 815/1000(కాలేజీ ఫస్ట్), తనుశ్రీ 789/1000(సెకండ్) సాధించారు.

వేసవి దుక్కులకు అనుకూలం

- రైతులు సన్నద్ధం కావాలంటున్న వ్యవసాయ నిపుణులు
- తొలకరి నాటికి పూర్తయితే మేలు
- సస్యరక్షణతో మరిన్ని లాభాలు



అచ్చెన్నపాలెంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

నల్లజర్ల: పంటల కోతల తర్వాత మళ్లీ వర్షాలు వచ్చే వరకు నేలను దుక్కిచేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలున్నాయి. తప్పనిసరిగా వేసవి దుక్కులు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. వ్యవసాయం లాభసాటి కావాలంటే నేల, నీటి సంరక్షణకు రైతులు అధిక ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ సూచిస్తున్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల భూమి స్థితిగతులు దెబ్బతింటున్నాయని, తద్వారా దిగుబడులు తగ్గడం, పెట్టుబడులు పెరగడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. భూసారం, పంట దిగుబడులు పెంచుకోవాలంటే రైతులు ముందస్తు యాజమాన్య చర్యలు పాటించాలని కమల్‌రాజ్ సూచిస్తున్నారు.

వాలుకు అడ్డంగా లోదుక్కులు

వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలో ఇంకాలంటే నేల పైపొర కొట్టుకుపోకుండా భూసారాన్ని పెంచుకునేలా పొలాల్లో వాలుగా ఉన్న ప్రాంతానికి అడ్డంగా సేద్యపు పనులు చేపట్టాలి. ఈ వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. గత పంటలకు సంబంధించిన అవశేషాలతో పాటు, చీడపీడలు, తెగుళ్లు ఆశించిన పొల్లాల్లో వాటి లక్షణాలు అలానే ఉండిపోతాయి. లోతుగా దుక్కులు చేయడం ద్వారా క్రిమి కీటకాలు, వాటి గుడ్లు బయటకు వచ్చి ఎండలకు నశిస్తాయి. దీనివల్ల పంట కాలంలో వచ్చే వివిధ రకాల చీడపీడలను ముందుగా అరికట్టవచ్చు. మొవ్వకుళ్లు, పల్లాకు తెగులు, గులాబీరంగు కాయతొలుచు పురుగు లాంటి ప్రమాదకరమైన తెగుళ్లు, వైరస్ వ్యాప్తి చేసే తామర పురుగుల వ్యాప్తిని నివారించవచ్చు. పంటలు విత్తుకునే సమయంలో కూడా వాలుకు అడ్డంగానే పంటలు వేయాలి. ఇలా చేయడం వల్ల భూమిలో తేమ శాతం పెంపొందిచవచ్చు. ప్రధాన పంటతో పాటు, రెండు, మూడు అంతర పంటలుగా వేయడం వల్ల కూడా తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. పొలం చుట్టూ కందకాలు తవ్వడం ద్వారా వర్షపు నీటిని ఎక్కడికక్కడే ఇంకేలా చేసుకోవడం మేలు. దీనివల్ల బెట్ట పరిస్థితులు ఏర్పడినా, పంటలు కొంతవరకు తట్టుకుంటాయి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేయాలి.

వరి సాగు ఇలా..

రబీ సీజన్‌లో నల్లజర్ల మండలంలో 2,115 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఇప్పటి వరకు 1,338 హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. ఇంకా 777 హెక్టార్లలో కోతలు పూర్తి కావాల్సి ఉంది. సుమారు 60 శాతం మేరకు కోతలు పూర్తయ్యాయి. ఎంటీయూ-1121, ఎక్స్‌ఎల్-10, పీఆర్-126 రకాలు సాగు చేశారు. ఇందులో ఎంటీయూ-1121 రకం ఆలస్యంగా సాగు చేసిన పోతవరం, చాదరాశిగుంట, సుభద్రపాలెం గ్రామాల్లో కోతలు ఆలస్యమయ్యాయి. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో పీఎల్-1100, బీపీటీ-5204, ఆర్‌ఎన్‌ఆర్-1504, ఎంటీయూ-7029(స్వర్ణ) రకాలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉన్న చీడపురుగు గుడ్లు బయట పడి కీటకాలు నశిస్తాయి. దీంతో పురుగు మందుల వాడకం తగ్గి, వాతావరణ కాలుష్యం కూడా ఉండదు. పంట కోతల తర్వాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. తద్వారా నీరు ఇంకిపోవడంతో భూమి సారవంతమవుతుంది.

– కె.కమల్‌రాజ్, మండల వ్యవసాయాధికారి, నల్లజర్ల

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వేసవి దుక్కులకు రబీ కోతల తర్వాత ఏప్రిల్ మాసం అనుకూలం. వాలుకు అడ్డంగా దుక్కులు చేయడం ద్వారా తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకుతుంది. ఈ దుక్కుల కారణంగా ఇతర గడ్డి జాతి మొక్కల విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు మొలిచే శక్తిని కోల్పోతాయి. దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలంలో చల్లాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా అందుతాయి.

– పుష్పలత, వ్యవసాయ విస్తరణాధికారి, నల్లజర్ల

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న వనిత, జక్కంపూడి రాజా తదితరులు

దేవరపల్లి: గౌరీపట్నంలోని శివాలయం వద్ద శ్రీనివాస కల్యాణ వేడుకలు గురువారం రాత్రి వైభవంగా జరిగాయి. కల్యాణ వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఇంకా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు తోట రామకృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కంఠమణి రమేష్, దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ మండలాల అధ్యక్షులు కూచిపూడి సతీష్, వెల్లంకి సుబ్రహమణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, మాజీ జెడ్పీటీసీ బంకా అప్పారావు, నాయకులు కాకులపాటి శ్రీనివాస్, మేడ్ని యువరాజ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



దేవరపల్లి సర్కిల్ కార్యాలయంలో సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీఐ నాయక్

దేవరపల్లి: నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు సీఐ బి.నాగేశ్వర్ నాయక్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని దేవరపల్లిలోని ప్రధాన రహదారి, డైమండ్ జంక్షన్, బస్టాండ్ వద్ద సుమారు వంద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దాతలు, గ్రామస్తులు, దుకాణ దారులు, వ్యాపార సంస్థలు, పరిశ్రమల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఓ దాత డ్రోన్ కెమెరాను సమకూర్చారని, దీనిని రాత్రి సమయంలో ఉపయోగిస్తున్నట్టు చెప్పారు. నేరస్తుల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ వల్ల భయం ఉంటుందని, తద్వారా నేర నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ప్రజలు గ్రామం విడిచి దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులకు తెలియజేస్తే, లాకర్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్టు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఇటీవల దేవరపల్లిలో జరిగిన కెమెరాల చోరీ కేసును చాకచక్యంగా ఛేదించి, నిందితులను పట్టుకోగలిగామని తెలిపారు. దేవరపల్లిలో 50, దుద్దుకూరులో 15, గౌరీపట్నంలో 20, యాదవోలులో 30 కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు వచ్చినట్టు చెప్పారు. చిన్నాయగూడెంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రైతులతో మాట్లాడుతున్నామన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

– పట్టణ అధ్యక్షుడిగా అన్నవరం






వెంపాటి సురేష్‌కుమార్ | చిట్టూరి అన్నవరం | కొలిశెట్టి నాగేశ్వరరావు | మట్టా వెంకట్రావు

కొవ్వూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కమిటీల నూతన అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. ప్రధాన సామాజిక వర్గాల చెందిన నాయకులకు పదవులు కట్టబెట్టడంతో అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా 23వ వార్డుకి చెందిన చిట్టూరి అన్నవరం సత్యనారాయణ ప్రసాద్(అన్నవరం)ను నియమించారు. ఈయన ప్రస్తుతం 23వ వార్డు కన్వీనర్‌గా ఉన్నారు. ఈయన భార్య మణి గత ప్రభుత్వ హయాంలో ద్వారకా తిరుమల దేవస్థానం డైరెక్టర్‌గా పని చేశారు. కొవ్వూరు మండల అధ్యక్షుడిగా ధర్మవరం గ్రామానికి చెందిన వెంపాటి సురేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈయన మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంపాటి సూర్యారావు తనయుడు. సూర్యారావు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత జీఎస్ రావు వర్గీయుడిగా పనిచేశారు.

తాళ్లపూడికి కొలిశెట్టి నియామకం

కాగా తాళ్లపూడి మండలానికి రావూరుపాడు గ్రామానికి చెందిన కొలిశెట్టి నాగేశ్వరరావును పార్టీ మండల అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈయన కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి గత పాలకవర్గంలో ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. 2002లో ఎంపీటీసీ సభ్యుడిగా పని చేశారు. ఈయన సతీమణి రాధారుక్మిణి గతంలో పెద్దేవం మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్‌గా పనిచేశారు. ఈయన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు జీఎస్ రావు ప్రధాన అనుచరుడిగా వ్యవహరించారు.

చాగల్లు అధ్యక్షుడిగా వెంకట్రావు

అలాగే పార్టీ చాగల్లు మండల అధ్యక్షుడిగా ఊనగట్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ మట్టా వెంకట్రావు నియమితులయ్యారు. గతంలో పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. వివాద రహితుడిగా పేరున్న వెంకట్రావు నియామకంపై హర్షం వ్యక్తమవుతోంది.

నిడదవోలు నియోజకవర్గ మండల అధ్యక్షులు వీరే..






కామిశెట్టి వీరవెంకట సత్యనారాయణ | అయినీడి పల్లారావు | నందిగాం భాస్కర రామయ్య | గండేపల్లి శ్రీరామకృష్ణ

నిడదవోలు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మండలాల నూతన అధ్యక్షుల నియామకాలను పార్టీ కేంద్ర కమిటీ ప్రకటించింది. పార్టీ నిడదవోలు పట్టణ అధ్యక్షుడిగా, 21వ వార్డు కౌన్సిలర్ కామిశెట్టి వెంకటసత్యనారాయణ, నిడదవోలు మండల అధ్యక్షుడిగా తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన అయినీడి పల్లారావు, ఉండ్రాజవరం మండల అధ్యక్షుడిగా వేలివెన్ను గ్రామానికి చెందిన జెడ్పీటీసీ సభ్యుడు నందిగాం భాస్కర రామయ్య, పెరవలి మండల అధ్యక్షుడిగా ముక్కామల గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి శ్రీరామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మండలాల అధ్యక్షులను ప్రకటించింది. పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ గతంలో 12 ఏళ్ల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా, పీసీసీ, డీసీసీ మెంబర్‌గా పనిచేసి, కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా కూడా పోటీ చేశారు. నిడదవోలు మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు 15 ఏళ్లుగా పార్టీలో క్రియాశీలక పాత్ర వహిస్తూ, పార్టీ మండల అధ్యక్షుడిగా మూడోసారి నియమితులయ్యారు. ఉండ్రాజవరం మండల అధ్యక్షుడు నందిగాం భాస్కర రామయ్య వేలివెన్ను సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం జెడ్పీటీసీ సభ్యునిగా కొనసాగుతున్నారు. పార్టీ ఉండ్రాజవరం మండల అధ్యక్షుడిగా మూడోసారి ఎంపికయ్యారు. పెరవలి మండల అధ్యక్షుడు గండేపల్లి శ్రీరామకృష్ణ ప్రస్తుతం ముక్కామల ఎంపీటీసీ-2 సభ్యునిగా కొనసాగుతున్నారు. పదేళ్ల పాటు వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ సమన్వయకర్త జి.శ్రీనివాస నాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులపై నిర్లక్ష్యం

– సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుందరబాబు



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

కొవ్వూరు: ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.సుందరబాబు విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. ఇంత వరకు ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రుపాయి ఖర్చు చేయనవసరం లేదన్నారు. కార్మిక సంక్షేమ బోర్డుకి కార్మికుల నిధిలో సెస్సు రూపంలో వచ్చిన రూ.4,298 కోట్లు వినియోగించుకోవచ్చని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది నిర్మాణ కార్మికులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకుంటే ఎంతటి పోరాటాలకైనా సిద్ధమని ప్రకటించారు. తొలుత స్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహామూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య, నాయకులు మైగాపుల నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, నాయకులు బి.పూర్ణిమరాజు మద్దతు తెలిపారు.

సోలార్ కరెంట్‌పై అవగాహన

తాళ్లపూడి: పీఎం సూర్యఘర్ పథకంలో ఇళ్లకు సోలార్ కరెంట్ ఏర్పాటు చేసుకుంటే ఒక్క రూపాయి కూడా కరెంట్ బిల్లు కట్టనవసరం లేదని ఏపీఈపీడీసీఎల్ మండల ఏఈ శ్రీనివాస్ తెలిపారు. తాళ్లపూడి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో సోలార్ యూనిట్ల ఏర్పాటుపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. వివిధ గ్రామాల వీవోలు, సీఏలు, క్లస్టర్ సీసీలు పాల్గొన్నారు.

నల్లజర్ల: అతి తక్కువ ధరకు విద్యుత్ పొందే పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ నల్లజర్ల డీఈఈ ఎం.శివప్రసాద్ కోరారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఈ పథకంపై అవగాహన కార్యక్రమం జరిగింది.

చాగల్లు: పీఎం సూర్య ఘర్ పథకంపై స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. పథకం తీరుతెన్నులను ఏపీఈపీడీసీఎల్ ఏఈ త్రిమూర్తులు వివరించారు.

మానవత సంస్థకు విరాళం

నల్లజర్ల: ప్రవాస భారతీయుడు పాతూరి హరనాథ్, ఆయన భార్య లక్ష్మీసౌజన్య మానవత సంస్థ నల్లజర్ల శాఖకు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ చెక్కును గురువారం హరనాథ్ తండ్రి అయిన సంస్థ మండల మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత డైరెక్టర్ అచ్చన్నపాలేనికి చెందిన పాతూరి సత్యనారాయణ సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు సూర్యనారాయణకు అందించారు. హరనాథ్ కుటుంబం గతంలోనూ రూ.2.50 లక్షల విరాళం అందజేశారని సూర్యనారాయణ తెలిపారు. సంస్థ సభ్యులు ఐడీపీ అప్పారావు, నందం రాజేంద్రప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

తాళ్లపూడి: రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోవడానికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమేనని, ద్విచక్ర మోటార్ వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. మండల మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవలో భాగంగా హెల్మెట్ ధరించాలని ప్రోత్సహిస్తూ ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పక్కిలంక ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును గురువారం ఎస్సై రామకృష్ణ ప్రారంభించారు.

వివాహాలకు వనిత హాజరు



జగన్‌మోహన్‌రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న వనిత

గోపాలపురం: మండలంలోని గోపాలపురం, వాదాలకుంట గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల వివాహాలకు గురువారం మాజీ హోం మంత్రి తానేటి వనిత హాజరై వధూవరులను ఆశీర్వదించారు. గోపాలపురం కేఎస్‌రెడ్డి ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు తమ్మిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి దంపతులను, వాదాలకుంటలో పెనుమాల కుమారి వివాహాలకు ఆమె హాజరయ్యారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ కాకులపాటి లలిత, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, కాకులపాటి శ్రీనివాసు, సాలి వేణు, ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.